

## కోర్టులో ఏసీబీ దాడులు

- రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ముగ్గురు నిందితులు

05



## ఏసీబీ వలలో సబ్ రిజిస్ట్రార్

- భూ రిజిస్ట్రేషన్‌కు బాధితుడి నుంచి లంచం డిమాండ్
- ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ మధ్యవర్తిత్వం
- అతడు రూ.16,500 తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

05

సంపుటి :02 | సంచిక :312 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

శుక్రవారం 20, ఫిబ్రవరి 2026



## ప్రక్షాళన జరిగేనా...?

- పారిశుధ్యం, మౌలిక సదుపాయాలపై ప్రజల ఆశలు
- కొత్త పాలకవర్గం జనం నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

04



## కాటారంలో కోతుల దండయాత్ర..!


ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు

04

- వ్యాపారులకు కునుకు లేకుండా చేస్తున్నవైనం
- చిన్నారులకు పొంచి ఉన్న పెను ప్రమాదం
- అటకెక్కిన సర్పంచ్ అభ్యర్థుల హామీలు
- పట్టించుకోవాలంటూ ప్రజల వేడుకోలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో కోతుల దండయాత్ర మిన్నంటింది. అడవిని మరిచిన వానర సైన్యం జనావాసాలపై పడి విరుచుకుపడుతోంది. సుమారు 1500లకు పైగా కోతులు గుంపులు గుంపులుగా కాలనీల్లో తిరుగుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా అయ్యప్ప టెంపుల్ వీధి, ఎర్రగుంటపల్లి, గంటగూడెం, గారెపల్లి మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో కోతుల వీరంగం అంతా ఇంతా కాదు. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా, అడ్డువచ్చిన వారిపై దాడులకు తెగబడుతున్నాయి.

—అక్షర దర్బార్ , కాటారం




ఎంపీటీసీ, జడ్పీటీసీ

## వ్యవస్థకు చరమగీతం?


- సర్పంచులకే అగ్ర తాంబూలం
- వారి ద్వారానే ఎంపీపీల ఎన్నికపై మొగ్గు

- ఎంపీపీల ద్వారా జడ్పీ చైర్మన్ ఎన్నికపై కసరత్తు
- పరోక్ష ఎన్నికల విధానం తెచ్చేందుకు అధ్యయనం
- పాత పద్ధతిపై రాష్ట్రప్రభుత్వం సమాలోచనలు
- 23న కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం?

అధికారాలు లేని పదవులు ఎందుకు? ఎంపీటీసీ, జడ్పీటీసీల కంటే సర్పంచులకే ప్రాధాన్యం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. గతంలో చంద్రబాబు, కేసీఆర్ హయాంలోనూ విఫలమైన ప్రయత్నం.. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సాకారం చేస్తారా ? అనే ప్రశ్నలు మళ్లీ తలెత్తాయి. స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థల వల్ల ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదనే భావనతో, వాటిని రద్దు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ ప్రజాప్రతినిధులకు సరైన అధికారాలు, బాధ్యతలు లేకపోవడం వల్ల ఈ వ్యవస్థ నామమాత్రంగా మారిందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి బదులుగా, గతంలో ఉన్న పాత పద్ధతిని పునరుద్ధరించి, సర్పంచుల ద్వారానే ఎంపీపీలను, అలాగే ఎంపీపీల ద్వారా జిల్లా పరిషత్ చైర్మన్లను ఎన్నుకునే పరోక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మార్పులపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని పంచాయతీరాజ్ శాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలుస్తోంది.

అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి

02



ఆఖరి అస్త్రం

## ఆపరేషన్ కగార్-2

- 100 శాతం మావోయిస్టుల ఏరివేతకు కూంబింగ్
- తెలంగాణ.. ఛత్తీస్గఢ్ సరిహద్దు అడవులు జల్లెడ
- సర్వశక్తులొడ్డుతున్న భద్రతా బలగాలు


05

# ఎంపీటీసీ, జడ్పీటీసీ
# వ్యవస్థకు చరమగీతం?

- సర్పంచులకే అగ్ర తాంబూలం
- వారి ద్వారానే ఎంపీపీల ఎన్నికపై మొగ్గు
- ఎంపీపీల ద్వారా జడ్పీ చైర్మన్ ఎన్నికపై కసరత్తు
- పరోక్ష ఎన్నికల విధానం తెచ్చేందుకు అధ్యయనం
- పాత పద్ధతిపై రాష్ట్ర ప్రభుత్వం సమాలోచనలు
- 23న కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం?

**అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి :**

అధికారాలు లేని పదవులు ఎందుకు? ఎంపీటీసీ, జడ్పీటీసీల కంటే సర్పంచులకే ప్రాధాన్యం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. గతంలో చంద్రబాబు, కేసీఆర్ హయాంలోనూ విఫలమైన ప్రయత్నం.. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సాకారం చేస్తారా ? అనే ప్రశ్నలు మళ్లీ తలెత్తాయి. స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థల వల్ల ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదనే భావనతో, వాటిని రద్దు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ ప్రజాప్రతినిధులకు సరైన అధికారాలు, బాధ్యతలు లేకపోవడం వల్ల ఈ వ్యవస్థ నామమాత్రంగా మారిందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి




బదులుగా, గతంలో ఉన్న పాత పద్ధతిని పునరుద్ధరించి, సర్పంచుల ద్వారానే ఎంపీపీలను, అలాగే ఎంపీపీల ద్వారా జిల్లా పరిషత్ చైర్మన్లను ఎన్నుకునే పరోక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మార్పులపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని పంచాయతీరాజ్ శాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలుస్తోంది.

### - క్యాబినెట్ సమావేశంలో..

ఈ వ్యవస్థాత్మక మార్పుకు ప్రధాన కారణం క్షేత్రస్థాయిలో అధికారాల కేంద్రీకరణ మరియు సమన్వయ లోపమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 1995 నుంచి అమల్లోకి వచ్చిన ఈ మూడంచెల వ్యవస్థలో సర్పంచ్‌కు గ్రామంలో పూర్తి అధికారాలు ఉన్నప్పటికీ, మండల పరిషత్‌లో ఎటువంటి పాత్ర ఉండటం లేదు. అదేవిధంగా, ఎంపీపీకి జిల్లా పరిషత్‌లో ప్రాధాన్యత దక్కడం లేదు. ఈ అంతరాలను తొలగించి, సర్పంచులకే కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా స్థానిక పాలనను మరింత బలోపేతం చేయవచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈనెల 23న జరగబోయే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగే అవకాశం ఉంది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను కూడా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

### - రాజకీయ నిరుద్యోగం పెరిగే అవకాశం

మరోవైపు, ఈ ప్రతిపాదన రాజకీయంగా కూడా పెను సంచలనానికి దారితీస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థను రద్దు చేస్తే వేలాది మంది రాజకీయ కార్యకర్తలకు పదవుల గండం ఏర్పడుతుంది. దీనివల్ల పార్టీల్లో 'రాజకీయ నిరుద్యోగం' పెరిగే ప్రమాదం ఉందని కొందరు సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు మాత్రమే ఉన్న ఎమ్మెల్సీ ఓటు హక్కును సర్పంచులు కూడా కోరుతున్నారు. ఈ చిక్కుముడులన్నీ విప్పడం ప్రభుత్వానికి కత్తిమీద సామే. రేవంత్ రెడ్డి స్వయంగా జెడ్పీటీసీ సభ్యుడి స్థాయి నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగిన నాయకుడు కాబట్టి, ఆయన ఈ వ్యవస్థను పూర్తిగా రద్దు చేస్తారా లేక సంస్కరణలతో సరిపెడతారా అనేది తేలాల్సి ఉంది.

### - సంస్కరణలు అంత సులభం కాదు..

అయితే, ఈ మార్పు అంత సులభం కాదని గత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో 1999లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఇలాంటి ప్రయత్నమే చేశారు. అప్పట్లో కేంద్రంలోని వాజపేయి ప్రభుత్వం చట్టసవరణకు మొగ్గు చూపినప్పటికీ, రాజ్యసభలో బలం లేకపోవడం మరియు కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ వంటి వారు 73, 74 రాజ్యాంగ సవరణల స్ఫూర్తికి ఇది విరుద్ధమని అడ్డుకోవడంతో ఆ ప్రయత్నం విరమించుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కేసీఆర్ హయాంలోనూ ఈ చర్చ జరిగినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సవరణను ఎలా ముందుకు తీసుకెళ్తుందనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా కేంద్రంలోని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనకు ఎంతవరకు సహకరిస్తుందనేది ఒక సవాల్ గా నిలవనుంది.



# టమాటా @ రూ.2

- గిట్టుబాటు ధర రాక రైతు కంట కన్నీరు
- స్థానికులకు ఉచితంగా పంపిణీ

అక్షరదర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లాలో టమాటా రైతుల దైన్యం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీసం పెట్టుబడి కూడా రాని దుస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. మార్కెట్‌లో టమాటా ధరలు పాతాళానికి పడిపోవడంతో, తాము పండించిన పంటను తెగనమ్ముకోలేక, పారబోయలేక చివరకు ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసిన హృదయవిదారక ఘటన కొత్తగూడ వారాంతపు సంతలో శుక్రవారం చోటుచేసుకుంది. మూడు ఎకరాల్లో వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటను కళ్లముందే ఉచితంగా ఇవ్వాల్సి రావడంపై అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు. గూడూరు మండలం భూపతిపేట గ్రామానికి చెందిన సారయ్య, మోహన్, సుందర్ అనే ముగ్గురు రైతులు తాము పండించిన 50 ట్రేల టమాటాలను అమ్మేందుకు ట్రాక్టరులో కొత్తగూడ సంతకు తీసుకొచ్చారు. అయితే మార్కెట్‌కు ఒక్కసారిగా భారీ స్థాయిలో టమాటా నిల్వలు రావడంతో ధర అమాంతం పడిపోయింది. వ్యాపారులు కేవలం రెండు రూపాయలకే కిలో టమాటా అడగడంతో రైతులు షాక్‌కు గురయ్యారు. ఆ ధరకు విక్రయిస్తే ట్రాక్టర్ కిరాయి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్రంగా మదనపడ్డారు. తీసుకొచ్చిన టమాటాలను తిరిగి గ్రామానికి తీసుకెళ్లలేక, అలాగని రోడ్డు పాలు చేయడం ఇష్టం లేక ఆ రైతులు ఒక భావోద్వేగ నిర్ణయం తీసుకున్నారు. కనీసం ప్రజలకైనా ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సంతకు వచ్చిన వారికి తమ పంటను ఉచితంగా పంచిపెట్టారు. అష్టకష్టాలు పడి పండించిన పంటను ఇలా ఉచితంగా పంపిణీ చేస్తున్న రైతును చూసి అక్కడి వారు ఆశ్చర్యపోయారు. ప్రభుత్వం స్పందించి తమలాంటి కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని, లేదంటే వ్యవసాయం చేయడం భారంగా మారుతుందని ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అనుమతులు నిల్లు.. దందా జోరు!

- నర్సింహులపల్లి శివారులో అక్రమ వెంచర్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- అధికారుల మౌనంపై విమర్శలు

అక్షరదర్బార్, హనుమకొండ : నిబంధనలు గాలికి.. రియల్టర్ల దందా జోరుగా సాగుతోంది. అటు కుడా నుంచి కానీ, ఇటు గ్రామ పంచాయతీ నుంచి కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే నర్సింహులపల్లి గ్రామ శివారులో అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు ఎగ్గొట్టి, నిబంధనలను తుంగలో తొక్కుతూ రియల్టర్లు అక్రమంగా ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. సొంత ఇంటి కల కంటున్న సామాన్యుల ఆశలను కొంతమంది రియల్టర్లు పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. సుమారు ఎకరం భూమిలో వెలసిన ఈ అక్రమ వెంచర్‌లో గజానికి వేల రూపాయలు వసూలు చేస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారు.

### - అధికారుల ఆంతర్యమేమిటి?

నర్సింహులపల్లి శివారులో యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నా, సంబంధిత అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల కళ్ల ముందే ఇంత దందా సాగుతున్నా చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న 'మర్మం' ఏమిటని గ్రామస్తులు గుసగుసలాడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అనుమతులు లేని వెంచర్లపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ విక్రయాలను అడ్డుకొని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# మేడారం జాతరపై పుస్తకం విడుదల

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ "గాడెస్ ఆఫ్ ఫోక్" పేరుతో మేడారం జాతరపై ప్రచురించిన ప్రచురణను గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ డి అనసూయ శుక్రవారం విడుదల చేశారు. అరుదైన ఛాయాచిత్రాలతో పుస్తకాన్ని సంకలనం చేసిన ప్రముఖ చిత్రనిర్మాత బి నర్సింగ్ రావు , ట్రస్ట్ సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు బిపి ఆచార్య, బివి పాపారావు, రిటైర్డ్ ఎన్ఐటి ప్రొఫెసర్ పాండురంగా రావు, కె శ్రీధర్ , రిటైర్డ్ డిజిపి ఎం రతన్ జె పూలే ప్రజా భవన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ట్రస్ట్ చేసిన కృషిని మంత్రి ప్రశంసించారు , సమ్మక్క సారలమ్మ జాతరను యునెస్కో ప్రపంచ వారసత్వ



సంపదగా గుర్తించడానికి అవసరమైన ప్రతిపాదనను సిద్ధం చేయాలని కోరారు.

# మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- అక్కల్ చెడ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన





అక్షర దర్బార్, చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రామంలోని డ్వాక్రా మహిళల కోసం సుమారు రూ.10 లక్షల సీడీఎఫ్ నిధులతో నిర్మించనున్న మహిళా భవనానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలనలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తూ మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకున్న మండలంలోని తొలి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. లబ్ధిదారులు తేజవత్ భద్రు–భవాని దంపతులను ఆశీర్వదించారు. అలాగే గ్రామంలో సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

## కంఠ మహేశ్వర స్వామికి పూజలు

అక్షర దర్బార్, నెక్కొంద: మండలంలోని దీక్షకుంట్ల గ్రామంలో గౌడ్ కులస్థుల ఆరాధ్యదైవమైన కంఠ మహేశ్వర స్వామి ఆలయంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ్ కులస్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఆయన, గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



## దుగ్గొండి జెడ్పీహెచ్ఎస్ ను సందర్శించిన కలెక్టర్

అక్షర దర్బార్, దుగ్గొండి : దుగ్గొండి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం పరిశీలించారు. పీఎంశ్రీ పథకం నిధుల వినియోగం, మౌలిక సదుపాయాలు మరియు విద్యా వాతావరణంపై సమీక్ష నిర్వహించారు. తరగతి గదులు, వంటశాల, భోజనశాల, ల్యాబ్‌లు, గ్రంథాలయం, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. నూతన వంటశాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. బాలికల మరుగుదొడ్లకు సౌకర్యవంతమైన మార్గం, సైన్స్ ల్యాబ్‌కు ర్యాంప్ నిర్మించాలని సూచించారు. పాఠశాలలో పచ్చదనం పెంపొందిస్తూ "ఒక విద్యార్థి–ఒక మొక్క" కార్యక్రమాన్ని అమలు చేయాలని తెలిపారు. లోపాలను వారం రోజుల్లో సరిచేసి నివేదిక సమర్పించాలని ప్రధానోపాధ్యాయునికి ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## గురుకుల ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- సమన్వయకర్త జయశ్రీ

అక్షరదర్బార్, ఇనుగుర్తి : ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం నిర్వహించే గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2026 ఈ నెల 22 ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు జిల్లా గురుకుల కళాశాలల సమన్వయకర్త జి. జయశ్రీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 5,352 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అభ్యర్థులు ఉదయం 9:30 గంటలకే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్లు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్షకు హాజరయ్యే వారు హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, వాటర్ బాటిల్, ఎగ్జామ్ ప్యాడ్ వెంట తీసుకురావాలని తెలిపారు.

## వరుస దొంగతనాల కేసుల్లో నిందితుడికి జైలు శిక్ష

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి : వరుస దొంగతనాలకు పాల్పడిన నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ భూపాలపల్లి 1వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ దిలీప్ కుమార్ ఈనెల 19న తీర్పు వెలువరించారు. ప్రతి కేసులో 12 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.100 చొప్పున జరిమానా విధించారు. మొత్తం ఐదు కేసుల్లో ఈ శిక్ష అమలుకానుంది. జిల్లా కాటారం మండలం ప్రతాపగిరి గ్రామానికి చెందిన ఎనుముల అర్జయ్య కాళేశ్వరం, కాటారం, అడవి ముత్తారం పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడగా, అడవి ముత్తారం పోలీసులు అరెస్ట్ చేశారు. సమగ్ర దర్యాప్తు అనంతరం ఐదు కేసుల్లో చార్జ్ షీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అర్థ కుమార్ వాదనలు వినిపించగా, ఎస్‌హెచ్‌ఓ మహేందర్ కుమార్ పర్యవేక్షణలో కోర్టు లైజనింగ్ ఆఫీసర్ వెంకన్న, సీడీఓ రమేష్ నాయక్‌లు సాక్ష్యాలను సమర్పించారు.



## పెరుమాండ్ల చిట్ ఫండ్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

- బహుజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారపెల్లి క్రాంతి కుమార్

అక్షర దర్బార్, శాయంపేట : పేదల నుంచి చిట్టీల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి ఘరానా మోసానికి పాల్పడిన పెరుమాండ్ల చిట్‌ఫండ్ యజమాని పెరుమాండ్ల కిషోర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బహుజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారపెల్లి క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన బాధితులతో కలిసి శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిట్టీల ద్వారా సేకరించిన డబ్బులతో బినామీ పేర్లపై ఆస్తులు కొనుగోలు చేశారని ఆరోపించారు. పేదలు తమ పిల్లల చదువు, పెళ్లిళ్లు, గృహనిర్మాణ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును తిరిగి ఇవ్వకుండా యజమాని పరారయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అతని పాస్‌పోర్ట్ ను రద్దు చేసి విదేశాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితులు గజ్జి శ్రీనివాస్, సిలువేరు శ్రీనివాస్, పరకాల రవి, రత్నమాల, వినయ్, వీణాచారి, రఘుపతి రెడ్డి, శ్రీవాణి, నాయకులు మొగ్గం సుమన్, విజయ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## పదవి బాధ్యతలు స్వీకరించిన నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా పెండెం శ్రీలక్ష్మి రామానంద్, వైస్ చైర్మన్‌గా గంధం నరేందర్ గుప్తా శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో వేద పండితుల ఆశీర్వాదాలతో పూజ కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతలు చేపట్టగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. పట్టణ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 100 పడకల ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ

అక్షరదర్బార్, మరిపెడ: మరిపెడ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా ఆసుపత్రి నిర్మాణం జరగాలని, నాణ్యత విషయంలో కాంట్రాక్టర్ అలసత్వం వహిస్తే సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా స్థాయి ఆసుపత్రిని మించే విధంగా అన్ని హంగులతో నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని, కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేశారు. ఆసుపత్రి ప్రధాన ప్రవేశద్వారం మార్గం కేవలం 10–12 మీటర్లే ఉండటంతో అంబులెన్స్ రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రవేశ ద్వారం సమీపంలో పీహెచ్‌సీ భూమిలో జరిగిన ఆక్రమణలను తొలగించి, రహదారిని విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న, నాయకులు లింగన్న, అంజి తదితరులు పాల్గొన్నారు.



# ఒక్కరా..? నలుగురా..?

- పరకాల ఆస్పత్రి ఉద్యోగాల మోసం ఆరోపణలపై చర్చ
- సంచలనం రేపిన 'అక్షర దర్బార్' కథనం

అక్షరదర్బార్, పరకాల: ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఈ అంశంపై 'అక్షరదర్బార్' పత్రికలో కథనం వెలువడిన తర్వాత పలువురు నిరుద్యోగులు తాము డబ్బులు ఇచ్చినట్లు పరస్పరం చెప్పుకుంటున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఈ వ్యవహారంలో పరకాల పట్టణనికి చెందిన డిప్యూటీ సివిల్ సర్జన్ ఒక్కరే డబ్బులు తీసుకున్నారా..? లేక పట్టణానికి చెందిన నలుగురు వైద్యులు కూడా పాలుపంచుకున్నారా..? అనే అంశంపై పట్టణంలో విస్తృత చర్చ జరుగుతోంది. కథనాలు వెలువడిన నేపథ్యంలో గురువారం రాత్రి డిప్యూటీ సివిల్ సర్జన్‌తో పాటు నలుగురు వైద్యులు సమావేశమై ఈ విషయంపై చర్చించుకున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. ఈ వ్యవహారం ఒక్కరితోనే జరిగిందా..? లేక పలువురు కలిసి నిర్వహించారా..? అనే అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# నూతన వధూవరులకు పుట్ట మధు ఆశీర్వాదాలు



అక్షర దర్బార్ మల్హర్ : మల్హర్ మండలంలోని కొండంపేట గ్రామంలో జరిగిన రమ్య–రవి వివాహ వేడుకకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గారు హాజరయ్యారు. పెళ్లి వేడుకలో పాల్గొన్న ఆయన, నూతన వధూవరులపై అక్షింతలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వధూవరుల కుటుంబ సభ్యులతో ముచ్చటించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు ఉన్నారు.



# ప్రక్షాళన జరిగేనా..?

- పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై ప్రజల ఆశలు
- కొత్త పాలకవర్గం జనం నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం పదవి స్వీకారం చేసిన నేపథ్యంలో పట్టణ ప్రక్షాళన జరుగుతుందా అనే చర్చ ప్రజల్లో మొదలైంది. గత సంవత్సరం పాటు పాలకవర్గం లేకపోవడంతో కాలనీల సమస్యలు అధికారుల దృష్టికి పూర్తిగా రాలేదని, ఇప్పుడు ఎన్నికైన కౌన్సిలర్లు ప్రతి వార్డు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాపాలనకు ఆదర్శంగా నిలిచేలా కొత్త పాలకవర్గం పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, వైస్‌చైర్మన్ దివ్యతో పాటు అన్ని పార్టీల కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభివృద్ధి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

## మౌలిక సదుపాయాల కొరత

మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు, 40 వేలకుపైగా జనాభా ఉన్నప్పటికీ పలు కాలనీల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు లేవని ప్రజలు తెలిపారు. రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో పట్టణం అశుభ్రంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ అదనపు పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరారు.

## ఇన్ చార్జ్ పాలనకు ముగింపు

పరకాల మున్సిపాలిటీలో పలువురు అధికారులు ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తున్నారని, వారి స్థానంలో రెగ్యులర్ అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఇంచార్జిలు వారానికి రెండు రోజులు మాత్రమే విధులు నిర్వర్తించడం వల్ల స్థానిక సమస్యలపై వారికి పూర్తి అవగాహన ఉండటం లేదని విమర్శిస్తున్నారు. కొత్తగా కొలువుదీరిన పాలకవర్గం దీనిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## - పాత వాహనాల పరిస్థితిని పరిశీలించాలి

పరకాల మున్సిపాలిటీలో రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు పనిచేయడం లేదని, వాటిని రిపేరుల పేరుతో ప్రజల ధనాన్ని దుర్వినియోగం చేయవద్దని, మున్సిపాలిటీకి అత్యవసర వాహనాలను సమకూర్చుకుని దుబారాలను పక్కకు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## - ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకోవాలి

ఎన్నికలు ముగిసిన దృష్ట్యా పాలకవర్గం రాజకీయాలను పక్కనపెట్టి మున్సిపాలిటీ ఆదాయ వనరులను బలోపేతం చేయాలని సూచించారు. మున్సిపల్ కాంప్లెక్స్ బకాయిలు, ఇంటి పన్నులు, అనుమతి లేని నిర్మాణాలను గుర్తించి క్రమబద్ధీకరిస్తే ఆదాయం పెరిగి అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

## - నిధుల వినియోగంలో పారదర్శకత

ఇంటి పన్ను, నీటి పన్నుల తదితర పన్నుల ద్వారా మున్సిపాలిటీకి ఏటా రూ.కోట్ల ఆదాయం వస్తోందని, ఆ నిధులను పారదర్శకంగా వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు. అవినీతి వల్ల ప్రజాధనం వృథా కాకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాలని సూచించారు.

## - పార్టీలకతీతంగా అభివృద్ధి

ఎన్నికల వరకే రాజకీయాలను పరిమితం చేసి అనంతరం పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లకు సమానంగా నిధులు కేటాయించి పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని కోరారు.

## - ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

మున్సిపల్ ఎన్నికల్లో కొత్తవారిని గెలిపించిన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా కౌన్సిలర్లు పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో చూపిన ఉత్సాహంతో అభివృద్ధి నిధులు తీసుకువచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అవినీతి రహిత, పారదర్శక ప్రజాపాలన అందించాలని మున్సిపల్ పాలకవర్గానికి సూచించారు.

# కాటారంలో కోతుల దండయాత్ర!

- ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు
- వ్యాపారులకు కునుకు లేకుండా చేస్తున్న వైనం
- చిన్నారులకు పొంచి ఉన్న పెను ప్రమాదం
- అటకెక్కిన సర్పంచ్ అభ్యర్థుల హామీలు
- పట్టించుకోవాలంటూ ప్రజల వేడుకోలు



అక్షర దర్బార్, కాటారం :జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలో వానర సైన్యం ప్రజలపై దండయాత్ర చేస్తోంది.అడవిని మరిచిన ఆ వానరులు జనావాసాలను తమ ఆవాసాలుగా మలుచుకుని దౌర్జన్యం చేస్తున్నాయి.గతంలో అటవీ ప్రాంతంలో మాత్రమే సంచరించే కోతులు కాస్తా జనాలు నివసించే స్థావరాల్లో హల్చల్ సృష్టిస్తున్నాయి.సుమారు 1500లకు పైగా కోతులు ఇళ్ళల్లో సంచరిస్తుండగా ఎక్కడ దాడి చేస్తాయో నని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.గుంపులుగా వస్తున్న ఆ కోతులు ఆయా కాలనీల్లోని ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలని ఎత్తుకెళుతూ తీవ్ర ఇబ్బందులను గురి చేస్తున్నాయి.తెల్లారిందంటే చాలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కోతులు ఆయా కాలనీల్లో తిరిగే స్థానికులని బెదిరిస్తూ పరేషాన్ చేస్తున్నాయి. ముఖ్యంగా అయ్యప్ప టెంపుల్ వీధి,ఎర్రగుంటపల్లి,గంటగూడెం,గారెపల్లి మెయిన్ రోడ్, తదితర ప్రాంతాల్లో కోతులు నానా హంగామా చేస్తున్నాయి.కోతుల భయంతో మహిళలు, వృద్ధులు బయటికి రావడానికి భయపడుతున్నారు. పిల్లలను ఒంటరిగా బయటికి పంపేందుకు తల్లిదండ్రులు వెనుకాడుతున్నారు.అలాగే ఇంటి పైకప్పులపై ఎక్కి వాటర్ ట్యాంక్ లని ధ్వంసం చేయడమే కాకుండా ఈత కొడుతున్నాయి. అలాగే పాత్ర గిన్నెలని, బయట ఆరబెట్టిన దుస్తులని చించేస్తూ వీరంగం సృష్టిస్తున్నాయి.దీంతో పనులన్నీ అయిపోయాక కొంత సేపు రెస్ట్ తీసుకుందామంటే కోతులు కునుకు లేకుండా చేస్తున్నాయి. అంతే కాకుండా వాటిని వెళ్లగొట్టే ప్రయత్నం ఎవరైనా చేస్తే వారిపై దాడులకు తెగబడుతూ గాయపరుస్తున్నాయి. ఇప్పటికే కోతుల బారిన గాయపడ్డ వారు ఇంజెక్షన్స్ తీసుకుంటుండగా ఇక ముందు వాటిని చూస్తేనే కంగుతినే దుస్థితి కాటారంలో ఏర్పడింది.

## కోతుల నుండి రక్షించండి మహాప్రభో..!!

కాటారం ఐదు మండలాలకు కూడలిగా ఉండడంతో ఆయా మండలాల జన సంచారం ఎక్కువగా ఉంటది.ఈ క్రమంలో ప్రధాన కూడళ్ల వద్ద పండ్లు, కూరగాయలు, జ్యూస్ సెంటర్లు, టిఫిన్ అండ్ మీల్స్ హోటల్స్ తదితరులు తిను బండారా షాపులు అధిక మొత్తంలో ఉన్నాయి.అయితే పూట గడవక పెట్టుకున్న ఆయా చిన్న చిన్న వ్యాపార సముదాయాలపై కోతులు యుద్ధం చేస్తున్నాయి. అటు గిరాకీ చూసుకోవాలో కోతులకు పహారా కాయాలో తోచక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా మమ్మల్ని పట్టించుకోండి మహా ప్రభో అంటూ వ్యాపారులు వేడుకుంటున్నారు.కేవలం కోతులు రాకుండా చూసుకోవడం కోసం ఓ వ్యక్తిని జీతానికి పెట్టుకుని పరిస్థితి వచ్చిందంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాగా కాటారం ప్రస్తుతం కోతుల షెల్టర్ జోన్ గా మారిందని తక్షణమే అధికారులు తగు చర్యలు తీసుకుని ఇటు ప్రజలని, అటు వ్యాపారులని కోతుల బారీ నుండి రక్షించాలని పలువురు కోరుతున్నారు.

## అటకెక్కిన సర్పంచ్ అభ్యర్థుల హామీలు..!!

కాటారం మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు సర్పంచ్ ఎన్నికల సమయంలో కోతుల నివారణే తమ మొదటి లక్ష్యమంటూ ప్రచారం చేసిన విషయం అందిరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో సర్పంచ్ లుగా గెలుపొంది బాధ్యతలు నిర్వర్తిస్తూ నెలలు గడుస్తున్న కోతుల నివారణ హామీలు అటకెక్కాయనే చెప్పుకోవచ్చు.ఎవరైనా కోతుల నివారణ గురించి సర్పంచ్లని అడిగినట్లయితే మాకు సర్కార్ నుండి ఇంకా ఫండ్ రాలేదని వచ్చాక కోతులు పట్టిస్తామని చెప్పడం విడ్డూరం. దీంతో అప్పుడేమో సర్పంచ్ ఎన్నికల సమయంలో సొంత ఖర్చులతో పట్టిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆ హామీలు నీటి మూటలేనా అంటూ ఆ గ్రామ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

# దేవాదుల ప్రాజెక్టుపై సర్కార్ నిర్లక్ష్యం

- పనులు ఒక్క అడుగైనా కదలడం లేదు..
- నిర్వహణ లేక ఎత్తిపోతల పథకాలు బంద్
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం
- మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు

అక్షరదర్బార్, హనుమకొండ : దేవాదుల ఎత్తిపోతల పథకం పట్ల ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. హనుమకొండ జిల్లాలోని దేవన్నపేట పంప్‌హౌస్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన, దేవాదుల ప్రాజెక్టు పనులు అంగుళం కూడా ముందుకు కదలడం లేదని విమర్శించారు. గత కాంగ్రెస్ పాలనలో ఈ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయని, అయితే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నీటి కేటాయింపులను 60 టీఎంసీలకు పెంచి ప్రాజెక్టును పరుగులు పెట్టించామని ఆయన గుర్తుచేశారు. ఆయకట్టును కూడా 47 వేల ఎకరాల నుంచి 3.17 లక్షల ఎకరాలకు విస్తరించి రైతులకు మేలు చేకూర్చామని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం కనీస నిర్వహణ ఖర్చులు భరించలేక ప్రాజెక్టును గాలికి వదిలేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం రూ.8 కోట్ల నిర్వహణ నిధులు లేక మోటార్లను నడపడం లేదని, దీనివల్ల గండి రామారంతో పాటు ఇతర లిఫ్టులు కూడా బంద్ అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవన్నపేట పంప్‌హౌస్‌లోని మూడు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని అధికారులు చెబుతున్నారని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాదుల ప్రాజెక్టుపై సుమారు 7,300 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 80 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని హరీశ్‌రావు వెల్లడించారు. ప్రాజెక్టుకు అవసరమైన 33 వేల ఎకరాల భూమిలో 30 వేల ఎకరాల భూసేకరణను తామే పూర్తి చేశామని స్పష్టం చేశారు. మరో రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి మిగిలిన భూసేకరణ పూర్తి చేస్తే, అదనంగా 2.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని ఆయన సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కాలంలో కనీసం 200 కోట్లు కూడా ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు చేయలేదని, ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# కొమ్మాల జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

- కొమ్మాల జాతర విజయవంతం చేయాలి
- పరకాల ఎమ్మెల్యే రేవూరి

అక్షర దర్బార్, పరకాల: శుక్రవారం గీసుగొండ మండలం కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర ఏర్పాట్లపై అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి  సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అంతకముందు జాతర పరిసర ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిబ్రవరి 23వ తేదీ నుండి జాతర ప్రారంభం కానున్న సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దాదాపు 1కోటి రూ నిధులు వెచ్చించి దేవాలయం వరకు రహదారి విస్తరణ పనులను చేపట్టామని అన్నారు. కొమ్మాల జాతర విజయవంతం చేయాలని కోరారు.

# పుట్ట మల్లన్నకు పూజలు

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం హుస్సేన్ పల్లి గ్రామ శివారులో పుట్ట మల్లన్న దేవాలయనికి దర్వాజా నిలబెట్టే కార్యక్రమాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు.పుట్ట మల్లన్న దేవాలయానికి దాతల సహకారంతో పునర్నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.అందులో భాగంగా గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు.

ఆఖరి అస్త్రం

# ఆపరేషన్ కగార్-2



- 100 శాతం మావోయిస్టుల ఏరివేతకు కూంబింగ్
- తెలంగాణ.. ఛత్తీస్ గఢ్ సరిహద్దు అడవులు జల్లెడ
- సర్వశక్తులొడ్డుతున్న భద్రతా బలగాలు

అక్షరదర్బార్, న్యూఢిల్లీ : భారత్ ను మార్చి 31లోపు మావోయిస్టు విముక్త దేశంగా మార్చాలన్న సంకల్పంతో కేంద్రం  తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో 'ఆపరేషన్ కగార్-2' (కేజీహెచ్-2) చేపట్టింది. మావోయిస్టులపై సాగుతున్న ఈ పోరాటాన్ని కేంద్రం ఒక అంతిమ పోరుగా భావిస్తోంది. మార్చి నెలాఖరులోగా మావోయిస్టుల ప్రాబల్యాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా లక్ష్యానికి అనుగుణంగా, సాయుధ బలగాలు తమ ఆఖరి అస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా అడవులను జల్లెడ పడుతున్న కేంద్ర బలగాలు, ఇప్పుడు తెలంగాణ సరిహద్దుల వైపు అడుగులు వేస్తుండటం అత్యంత కీలక పరిణామంగా మారింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అడవుల్లో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న పక్కా సమాచారంతో గ్రేహౌండ్స్ బలగాలతో కలిసి ఈ సంయుక్త వేటను సాగిస్తున్నారు. చాలా కాలం తర్వాత కేంద్ర బలగాలు తెలంగాణ అడవుల్లోకి ప్రవేశించి కూంబింగ్ చేపట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్టలు, నేషనల్ పార్క్, అబూజ్‌మడ్ వంటి ప్రాంతాల్లో గత ఏడాదిన్నరగా ప్రతి నాలుగు కిలోమీటర్లకో బేస్ క్యాంపు ఏర్పాటు చేయడంతో, మావోయిస్టులు ప్రాణరక్షణ కోసం తెలంగాణ వైపునకు వస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఇటీవల ఆసిఫాబాద్ అడవుల్లో పదుల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం ఈ సమాచారానికి బలాన్ని చేకూర్చింది. ముఖ్యంగా పీఎల్‌జీఏ కమాండ్ బర్సే దేవా బృందం కదలికలపై నిఘా ఉంచిన బలగాలు, సరిహద్దు దాటకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.

**- అగ్రనాయకత్వమే టార్గెట్..**

ప్రస్తుత ఆపరేషన్‌లో భాగంగా మావోయిస్టుల అగ్ర నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ, తెలంగాణ కార్యదర్శి దామోదర్, పీఎల్‌జీఏ బెటాలియన్ ఇన్‌ఛార్జి కేసా సోధితో పాటు సుమారు 60 నుంచి 70 మంది మావోయిస్టులు ఈ అడవుల్లో మకాం వేసినట్లు బలగాలు గుర్తించాయి. అయితే ఈ ఆపరేషన్‌లో కేవలం కాల్పులకే పరిమితం కాకుండా, మావోయిస్టులను లొంగిపోయేలా ఒత్తిడి పెంచేందుకు బలగాలు ప్రాధాన్యతనిస్తున్నాయి. అగ్ర నేతలు లొంగిపోతే మావోయిస్టు వ్యవస్థ బలహీనపడుతుందని, తద్వారా శాశ్వత శాంతి నెలకొంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, గతంలో మావోయిస్టులు అమర్చిన ల్యాండ్‌మైన్లు, బూబీ ట్రాప్స్‌ను తొలగించే 'డీ-మైనింగ్' ప్రక్రియపై కూడా బలగాలు ప్రత్యేక దృష్టి సారించాయి. కర్రెగుట్టలు వంటి ప్రాంతాలను భవిష్యత్తులో పర్యాటక కేంద్రాలుగా మార్చాలనే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం, అక్కడి ప్రమాదకరమైన మందుపాతరలను ఏరివేస్తోంది. గతంలో జరిగిన 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్' తరహాలోనే, ఇప్పుడు 'కగార్-2' ద్వారా మావోయిస్టుల ఉనికిని పూర్తిగా తొలగించేందుకు సాయుధ బలగాలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. అటవీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలపై ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే, మావోయిస్టుల ఏరివేతను తుది దశకు చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# కోర్టులో ఏసీబీ దాడులు

- రూ.5 వేలు లంచం తీసుకుంటూ
- పట్టుబడిన ముగ్గురు నిందితులు

అక్షరదర్బార్, భూపాలపల్లి : అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) శుక్రవారం భూపాలపల్లి జిల్లా కోర్టులో మెరుపు దాడులు నిర్వహించారు. ఒక వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ముగ్గురు కోర్టు సిబ్బందిని అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఒక కేసు కు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలను ఇచ్చేందుకు కోర్టు సిబ్బంది గోపాలరావు అనే న్యాయవాదిని లంచం డిమాండ్ చేశారు. స్టెనోగ్రాఫర్ సాయి చరణ్ తో పాటు మరో ఇద్దరు సిబ్బంది పున్నం రజిత, కొమ్ము సునీత కలిసి రూ.5 వేలు  ఇస్తేనే పని అవుతుందని పట్టుబట్టారు. దీంతో సదరు న్యాయవాది ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్ ప్రకారం రంగంలోకి దిగి నిఘా పెట్టారు. నిర్ణయించుకున్న ప్రకారం న్యాయవాది నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి సాయి చరణ్, రజిత, సునీతను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న అధికారులు, వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఆవరణలోనే సిబ్బంది అవినీతికి పాల్పడి దొరికిపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అరెస్టయిన వారిపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు వెల్లడించారు.



# ఏసీబీ వలలో సబ్ రిజిస్ట్రార్

- రిజిస్ట్రేషన్ కు బాధితుడి నుంచి లంచం డిమాండ్
- ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ మధ్యవర్తిత్వం
- రూ.16,500 తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ



అక్షరదర్బార్, మంథని  : పెద్దపల్లి జిల్లా మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేశారు. సబ్ రిజిస్ట్రార్ కసర్ల రాజేందర్ పురమాయించగా,  ఓ ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్.. బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఒక వ్యక్తి కొనుగోలు చేసిన భూమి రిజిస్ట్రేషన్ కోసం సదరు అధికారి లంచం డిమాండ్ చేశారు.  ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ రషీద్ ద్వారా రూ. 16,500 లంచం తీసుకుంటుండగా కరీంనగర్ ఏసీబీ బృందం పట్టుకుంది. అధికారులు సదరు లంచం సొమ్మును రషీద్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సబ్ రిజిస్ట్రార్ రాజేందర్ తన విధులను పారదర్శకంగా నిర్వహించకుండా అవినీతికి పాల్పడ్డారని ఏసీబీ నిర్ధారించింది. లంచం అడిగిన అధికారి రాజేందర్ తో పాటు లంచం డబ్బు తీసుకున్న రషీద్ ను కూడా ఏసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరిని కరీంనగర్ లోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను ఏసీబీ గోప్యంగా ఉంచింది. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915